2014 ఎన్నికల సమయంలో టీడీపీ-జనసేన-బీజేపీ కలిసి పోటీ చేశాయి. ఆ సమయంలో ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఊదరగొట్టారు. డిగ్రీ , తత్సమానమైన చదువు పూర్తి చేసిన వారికి నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. యువత ఓట్లు దక్కించుకుని అధికారంలోకి వచ్చారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు నాలుగు న్నరేళ్లు గడిచిన తర్వాత అర్హత ఉన్నవారిలో కనీసం 20 శాతం మందికి కూడా భృతి ఇవ్వకుండా దగా చేశారు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి టీడీపీ-జనసేన-బీజేపీ జతకట్టాయి. మళ్లీ నిరుద్యోగ భృతి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. లేకపోతే నెలకు రూ. 3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. వారి మాటలు నమ్మిన నిరుద్యోగులు మరోసారి కూటమికి ఓట్లు వేశారు. కానీ అధికారం చేపట్టి నెల రోజులు దాటినా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భృతిపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

బాబూ.. భృతి హామీ గుర్తుందా!



- 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటన
- అప్పటి వరకూ నెల రూ.3 వేల చొప్పున భృతి ఇస్తామని హామీ
- హామీ అమలుకు పడని ముందడుగు
- దాదాపు 12 వేల మంది నిరుద్యోగుల ఎదురుచూపులు

పెందుర్తి: నియోజకవర్గంలోని నిరుద్యోగులు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. భారీగా ఉద్యోగాలు ఇస్తాం..లేకపోతే భృతి అందిస్తామని చెప్పిన ఆ హామీని నిలబెట్టుకుంటుందని గంపెడాశాలతో ఎదురు చూస్తున్నారు. భృతి ఎప్పుడు ఇస్తారన్నదానిపై ప్రభుత్వం నుంచి ప్రకటన వస్తుందని దాదాపు 12 వేల మంది నిరుద్యోగులు ఆశిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని మెనిఫెస్టోలో ప్రకటించింది. మెగా డీఎస్సీపై మొదటి సంతకం అంటూ ఊదరగొట్టి కాలయాపన చేస్తున్నారు. ఇతర ఉద్యోగాలపై ఎలాంటి ప్రకటన లేదు. దీంతో కనీసం భృతి అయినా చెల్లించాలని నిరుద్యోగ యువత కోరుతోంది.

గతంలో జరిగినట్టేనా..



అనుకోని కారణాల వల్ల ఇంటర్మీడియట్‌తో చదువు ఆపేశాను. నా చదువుకు తగ్గ ఉద్యోగం వస్తుందని చాన్నాళ్లుగా ప్రయత్నం చేస్తున్నాను. కానీ రాలేదు. ఉద్యోగం ఇవ్వకపోతే రూ.3 వేలు భృతి ఇస్తామని కూటమి హామీ ఇచ్చింది. దాన్ని త్వరగా అమలు చేస్తారని ఆశిస్తున్నాను. 2014లో హామీ ఇచ్చి ఇవ్వలేదు. ఇప్పుడు అలా చేయవద్దు.

– యర్ర ఉదయ్‌కిరణ్, పెందుర్తి, ఇంటర్మీడియట్ పూర్తి

సూపర్ సిక్స్.. మొదటిదే డౌట్



డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగావకాశాల కోసం ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. కూటమి సూపర్ సిక్స్‌లో ఇచ్చిన మొదటి హామీ ప్రకారం ఉద్యోగాలు కల్పించే వరకూ నిరుద్యోగ భృతి చెల్లించాలి.

– గొరుపూడి శ్రీనివాసరావు, పరవాడ

ఎదురు చూస్తున్నా..



నేను డిప్లమో పూర్తి చేశాను. అధికారంలోకి వస్తే ఉద్యోగాలు తీస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పడంతో మేమంతా నమ్మాం.లేక పోతే భృతి ఇస్తామన్నారు. నెల రోజులు దాటినా భృతిపై ఎలాంటి నిర్ణయం లేదు.

– వీపీవీ సాయి, చినముషిడివాడ

భృతి ఎప్పుడు ఇస్తారో..



నేను బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశాను. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. కూటమి ఉద్యోగాల కల్పనకు పెద్ద పీట వేస్తామని చెప్పింది. దానిపై ఇంకా క్లారిటీ లేదు. కనీసం భృతి ఎప్పటి నుంచి ఇస్తారో ప్రకటించాలి. – రొంగలి జయకిరణ్, సబ్బవరం.

ఘనంగా పైడిమాంబ తొలేళ్లు



సారె ఊరేగింపులో మహిళలు

పెందుర్తి: పెందుర్తి ప్రజల గ్రామ ఆరాధ్య దేవత పైడిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రకరకాల పిండి వంటలు, ఫలాలతో సారె ఊరేగింపు చేశారు. అనంతరం అమ్మవారికి సారె సమర్పించారు. మంగళవారం అమ్మవారి పండగ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ఆలయ కమిటీ ప్రతినిధులు గొర్లె రామునాయుడు, గొర్లె శ్రీనివాసరావు, దాసరి శ్రీను, గొర్లె రామునాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు.

స్వచ్ఛంద సేవకులతో ఈవో సమీక్ష

సింహాచలం: గిరిప్రదక్షిణలో భక్తులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అమోఘమని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కొనియాడారు. ఈ నెల 20న సింహగిరి ప్రదక్షిణ, 21న సింహగిరిపై ఆలయ ప్రదక్షిణలను పురస్కరించుకుని భక్తులకు ఆహారపదార్థాలు, పానియాలు అందించే స్వచ్ఛంద సంస్థలతో సోమవారం దేవస్థానం పరిపాలన కార్యాలయంలో ఈవో సమావేశం నిర్వహించారు. ఎవరెవరు ఏయే ప్రదేశాల్లో భక్తులకు ఆహారపదార్థాలు, పానియాలు అందిస్తారో తెలుసుకున్నారు. కార్యక్రమంలో నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

ఉపాధి రికార్డులు పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి

పరవాడ: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. 2023-24లో వివిధ శాఖల్లో చేపట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పనులపై ఆయా శాఖల అధికారులతో సామాజిక తనిఖీలు నిర్వహించడం ద్వారా ఉపాధి కూలీలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సమావేశంలో ఏపీవో గోవిందరావు, ఎంపీడీవో కీర్తిస్పందన, హౌసింగ్ ఏఈ రెడ్డి, నాయకులు గొర్లి గోపి, కూండ్రపు సీతారామయ్య, సూపరింటెండెంట్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉపాధి కల్పించాలి

పరవాడ: ఫార్మా వ్యర్థాల కారణంగా ఉపాధి కోల్పోయిన ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఫార్మా పరిశ్రమల్లో ఉపాధి కల్పించి ఆదుకోవాలని మత్స్యకార నాయకుడు చింతకాయల ముత్యాలు డిమాండ్ చేశారు. అనకాపల్లిలో సోమవారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. చేపల వేటే ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్న ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఫార్మా పరిశ్రమలు విడుదల చేస్తున్న రసాయనాల కారణంగా మత్స్య సంపదకు నష్టం వాటిల్లి ఉపాధి గగనమవుతోందన్నారు. మత్స్యకార్మికుల ఇబ్బందులను గుర్తించి ఉపాధి అవకాశాలతో పాటు ప్యాకేజీ కూడా చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మత్స్యకార నాయకులు చింతకాయల ముత్యాలు, చింతకాయల అమ్మోరు, సోంబాబు, రమణమూర్తి, ముత్యాలయ్య, బొంది రంగారావు, కొవిరి తాతారావు ఉన్నారు.

పునరావాసానికి స్థల పరిశీలన

పరవాడ: ఫార్మాసిటీ కాలుష్యంలో చిక్కుకున్న తాడి గ్రామ ప్రజలకు పునరావాసం కల్పించడానికి పెదముషిడివాడలో గుర్తించిన స్థలాన్ని జనసేన పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ గణపతిరావు, కూటమి నేతలు సందర్శించారు. తాడి వాసులను తరలించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.స్థలాన్ని సందర్శించిన వారిలో మాజీ ఎంపీపీలు పైల జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, మండల జనసేన అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాస్, టీడీపీ నేత వియ్యపు చిన్న, దుళ్ల రామునాయుడు, జనసేన జిల్లా కార్యదర్శి బుగిడి గోవిందరావు, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, తాడి మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు ఉన్నారు.

వైభవంగా నృసింహ హోమం



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: స్వాతి నక్షత్రం పురస్కరించుకుని సింహగిరిపై సోమవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతి స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.దీనిలో భాగంగా ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో హోమాన్ని ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు విశేషంగా నిర్వహించారు. ప్రధాన కలశాన్ని అర్చకుడు శ్రీకాంతాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాలుష్యం కట్టడికి చర్యలు తీసుకోండి

పరవాడ: పెదముషిడివాడ గ్రామాన్ని ఫార్మా కాలుష్యం నుంచి కాపాడాలని గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫార్మాసిటీ పరిశ్రమల యాజమాన్యాలు ఇష్టానుసారంగా రసాయన వ్యర్థాలను తమ గ్రామంలో డంప్ చేయడం వల్ల దుర్వాసనతో గ్రామస్తులు ఇబ్బంది పడాల్సి వస్తుందని వివరించారు. పీసీబీ అధికారులతో విచారణ జరిపించాలని సర్పంచ్ నాగమణి కోరారు. ఆమె వెంట పల్లా అప్పారావు(కబడ్డీ) ఉన్నారు.